క్లుప్తంగా

ముర్రుపాలు శ్రేయస్కరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ

ఆళ్లగడ్డ: ముర్రుపాలు బిడ్డకు పట్టించడం పట్ల తల్లీబిడ్డలిద్దరికీ శ్రేయస్కరమని సీడీపీఓ తేజేశ్వరి అన్నారు. తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా గురువారం పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో విద్యార్థులకు ×తల్లి పాలతో ప్రయోజనాలు₹పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని అన్నారు. కనీసం ఆరు నెలల వరకైనా బిడ్డకు తల్లిపాలను కచ్చితంగా తాగించాలని కోరారు. వీలైనన్ని రోజులు తన బిడ్డకు తల్లి పాలు ఇవ్వడంతో తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

బైక్ ఢీకొని రిటైర్డు ఉద్యోగి మృతి

నంద్యాల: పట్టణంలోని విద్యుత్ కార్యాలయ సమీపంలో రోడ్డు దాటుతున్న రిటైర్డు ఉద్యోగిని బైక్ ఢీకొనడంతో మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జుగుప్త గురువారం తెలిపారు. పట్టణంలోని విశ్వనగర్‌కు చెందిన రిటైర్డు ఉద్యోగి సుంకిరెడ్డి వాకింగ్‌కు వెళ్లి ఇంటికి వస్తున్నాడు. అదే క్రమంలో సోమేశ్వరరెడ్డి అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఎదురుగా ఉన్న ఆటోను తప్పించే క్రమంలో సుంకిరెడ్డిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడే మృతి చెందాడు. సోమేశ్వరరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన శ్రీలేఖ

శిరివెళ్ల: గోవిందపల్లెకు చెందిన ఓ మహిళ గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కాకి శ్రీలేఖ (32) ఐదేళ్లగా మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతోంది. దీంతో మానసిక ఆందోళనకు గురై ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కళాశాల కోసం..



వైట్ వాస్ వేయించిన కళాశాల భవనం

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఓ అధ్యాపకుడు చేయూత అందించారు. కళాశాల భవనానికి వేసిన పెయింటింగ్ వెలిసిపోయి పాత భవనంలో కనిపిస్తుండటంతో అక్కడ పనిచేస్తున్న గణిత అధ్యాపకుడు రాంభూపాల్ రెడ్డి తన వంతు సహాయంగా సొంత ఖర్చులతో వైట్ వాష్ వేయించారు. కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్న అతడిని కళాశాల ప్రిన్సిపల్ సునీత, అధ్యాపకులు అభినందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఏఓ ప్రసాదరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. యజమానులు ఎఫ్‌సీఓ 1985 చట్టం ప్రకారం ఎరువుల వ్యాపారం చేయాలని, గోడౌన్లు, దుకాణాలయందు ఎరువుల నిల్వలను ప్రతి రోజూ మండల వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డులను అప్‌డేట్ చేయాలన్నారు. ఎరువులను ఎమ్మార్పీకే అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి ఎరువుల వ్యాపారం నిర్వహించినా, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు చాపిరేవుల విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాయలసీమ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు చాపిరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు తిరుపతిలో జరిగే ఈ పోటీలకు తమ విద్యార్థినులు హర్షియ, యాస్మిన్‌లు ఎంపికైనట్లు చాపిరేవుల జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పీఈటీ రవి కుమార్‌లు తెలిపారు. గురువారం జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు కేవీ సుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

శిల్పా కుటుంబంపై విమర్శలు తగవు

- చేతనైతే సేవా కార్యక్రమాలు చేయండి హర్షిస్తాం
- డబ్బుతో పదవి కొన్నంత సులువు కాదు.. సేవ చేయడం అంటే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల: నియోజకవర్గంలో సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తున్న శిల్పా కుటుంబంపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. గురువారం పట్టణంలోని శిల్పా స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కారు రవికుమార్, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు శివయ్య మాట్లాడారు. శిల్పా కుటుంబం రెండు దశాబ్దాలుగా నంద్యాల ప్రజలకు శిల్పా సేవా సమితి ద్వారా అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. రాజకీయ దురుద్దేశంతో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు శిల్పా కుటుంబంపై విమర్శలు చేస్తున్నారన్నారు. డబ్బు పెట్టి పదవి ఎవరైన కొని తెచ్చుకోగలరని, ఆ పదవి ఎలా వచ్చిందో నియోజకవర్గ ప్రజలకు అందరికీ తెలుసునన్నారు. సేవా కార్యక్రమాలు చేయడం డబ్బుతో పదువులు కొన్నంత సులువు కాదని ఎద్దేశా చేశారు. చేతనైతే విమర్శలు మానేసి విమర్శించిన వారు సేవా కార్యక్రమాలను చేపడితే అటువంటి వారిని రాజకీయాలకతీతంగా తాము కూడా హర్షిస్తామన్నారు. గత రెండు దశాబ్దాల కాలం నుంచి శిల్పా సేవా సమితి ద్వారా శిల్పా సహకార్, శిల్పా మహిళా సహకార బ్యాంక్, నంది రైతు సమాఖ్య, శిల్పా మినరల్ వాటర్ ఇలా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు శిల్పా కుటుంబం రైతులకు అన్యాయం చేస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నంద్యాల మార్కెట్ యార్డ్ సంబంధించి షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించిన ప్రారంభంలో రూ.300 నెలకు బాడుగ ఏర్పాటు చేసినా కూడా ఎవరు ఆ షాప్ లను బాడుగకు తీసు కోవడానికి ముందుకు రాలేదన్నారు. ఆ సమయంలో శిల్పా సేవా సమితిని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లను మాజీ ముఖ్యమంత్రి శిల్పా మోహన్ రెడ్డి నెలకు రూ.900 బాడుగకు తీసుకొని శిల్పాసహకార్, శిల్పా మహిళా బ్యాంక్, నంది రైతు సమాఖ్య ద్వారా రైతులకు సబ్సిడీపై ఎరువులు విత్తనాలను అందిస్తూ నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. నేడు మార్కెట్ విలువలకు అనుగుణంగా షాపింగ్ కాంప్లెక్స్‌లకు అద్దె చెల్లిస్తున్న కూడా టీడీపీ నేతలు రాజకీయ కక్షతో టీడీపీ అగ్ర నాయకుల వద్ద వారి పబ్బం గడపడానికి అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. టీడీపీ నేతల చౌకబారు విమర్శలను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శశికళా రెడ్డి, పార్థసారధిలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మహిళా న్యాయవాదులతో క్యారమ్ బోర్డు ఆడుతున్న జడ్జి తంగమని

నంద్యాల(వ్యవసాయం): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమనిఅన్నారు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులకు క్యారమ్ బోర్డు, చెస్, క్రికెట్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. న్యాయవాదులు నిత్యం కక్షిదారుల కేసులతో సతమతమవుతూ ఒత్తిడికి లోనవుతుంటారని, ఈ క్రమంలో క్రీడలు మానసిక ఉల్లాసం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతాయన్నారు. మహిళా న్యాయవాదులతో జడ్జి తంగమని క్యారమ్స్ ఆడారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాషా, స్పోర్ట్స్ సెక్రటరీ దాసరి లింగమయ్యలు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులకు క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

19 నుంచి పీ-4 అమలు

శిరివెళ్ల: ఈ నెల 19వ తేదీ నుండి పీ-4ను అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏంపీడీఓ శ్రీనివాసశర్మ గురువారం తెలిపారు. మండలంలో సర్వే ప్రకారం 2,600 బంగారు కుటుంబాలున్నాయన్నారు. ఆ కుటుంబాలకు చేదోడు వాడోడుగా ఉండేందుకు 1,106 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చారన్నారు. పేదరిక నిర్మూనలో భాగంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు.

ఉద్యోగులను విస్మరించే కూటమికి అధోగతి

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వానికి అధోగతి పడుతుందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఆదేశాల మేరకు ×రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం₹ అనే కార్యక్రమంలో భాగంగా మూడవ రోజున నీటి పారుదల శాఖ కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయని ప్రభుత్వాలు మనకెందుకని ప్రశ్నించారు. ఉద్యోగులకు రూ.35వేల కోట్లు బకాయి ఉందని, ఈ మొత్తాన్ని ఎప్పుడు చెల్లిస్తారో తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, సిటీ అధ్యక్షుడు సత్యం, ఉపాధ్యక్షులు ఏసురత్నం, ప్రభావతి, పూర్ణాచారి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి

రుద్రవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు వీడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. మండల పరిధిలోని చిన్నకంబ లూరు మెట్ట వద్ద గురువారం ఆయన జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, కమిటీ సభ్యులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడి రైతులు దివాలా తీసే విధంగా ఉన్నాయన్నారు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు పెంచే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని విమర్శించారు. రైతులందరూ సంఘటితమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుర్రెడ్డి, కేశాలు, హరినారాయణ, హుస్సేన్‌బాషా, నాగేశ్వరావు, మల్లేష్, నాగేష్, కమ్మన్న, నరేష్, రామకృష్ణ, హనుమంతుతో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వంద సేవా కార్యక్రమాలు

నంద్యాల(వ్యవసాయం): భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని టౌన్ పార్క్‌లోని ఆయుష్ యోగా కేంద్రంలో యోగా గురుజీ ఖండే ఆనంద్ గురుజీ ఆధ్వర్యంలో శనివారం నుంచి వంద సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయిబాబా అవతరించి వంద సంవత్సరాలు అవుతుందన్నారు. స్వామి అడుగుజాడల్లో నడుస్తూ వందరోజుల సేవా కార్యక్రమాలు, వంద సత్సంఘాలు, వంద భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో పేద వారికి కంటి ఆపరేషన్లు, కుట్టు మిషన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్, కృత్రిమ అవయవాలు, రక్తదాన శిబిరాలు, వినికిడి మిషన్లు,పేదలకు వారికి నిత్యావసర సరుకులు, అన్నదాన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు, గర్భిణులకు సీమంతాలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

సాధారణ బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయాలి



ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం సాధారణ బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వ కళాశాల లెక్చరర్ అసోసియేషన్, గజిటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళకు అందజేశారు. ఈ సందర్భంగా జీసీటీఏ, జీసీజీటీఏ అసోసియేషన్ల నాయకులు రామలింగారెడ్డి, శైలజారాణి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా సాధారణ బదిలీల కోసం ఎన్నో రకాలుగా అభ్యర్థనలను చేసుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం టోల్‌గేట్ సమీపంలో రామయ్య టర్నింగ్ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. శ్రీశైలానికి చెందిన హరి(23), అతని భార్య పని నిమిత్తం సున్నిపెంటకు బైక్‌పై బయలుదేరారు. అదే సమయంలో సున్నిపెంట నుంచి శ్రీశైలం వస్తున్న ద్విచక్రవాహనదారుడు.. వీరి బైక్‌ను ఢీకొనడంతో హరి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో సున్నిపెంట వైద్యశాలకు తరలించారు. మృతుడు హరి శ్రీశైలం బస్టాండ్ సమీపంలో బడ్డీకొట్టు నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

నంద్యాల(న్యూటౌన్): మార్క్‌ఫెడ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తానని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారు రాజు అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం ఉన్న మార్క్‌ఫెడ్ ఆవరణలో నూతనంగా రూ.1.50 కోట్లతో నిర్మించిన ధాన్య, పప్పుల మిల్లు కర్మాగారాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మార్క్‌ఫెడ్‌కు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు మహమ్మద్‌గౌస్ చైర్మన్ దృష్టికి తీసుకొని వెళ్లారు. బోర్డు సమావేశాల్లో చర్చించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథరెడ్డి, మేనేజర్ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు కృషి

- అమరావతి సర్కిల్ ఎస్‌బీఐ సీజీఎం రాజేష్ కుమార్ పాటిల్



బాధితులకు బీమా చెక్కులను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

నంద్యాల: గ్రామీణ స్థాయిలోనే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేయాలని అమరావతి సర్కిల్ ఎస్‌బీఐ సీజీఎం రాజేష్ కుమార్ పాటిల్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై గ్రామస్థాయి ఆర్థిక స్వావలంబనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జన్ ధన్ యోజన, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై ఎస్‌బీఐ ఖాతాదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌బీఐ సీజీఎం మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాలలో సామాజిక భద్రత పథకాలలో అర్హులైన వారందరూ పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యలపై అడిషనల్ ఎస్పీ జావలి సమావేశంలో అవగాహన కల్పించారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందిన రెండు కుటుంబాలకు సంబంధించి జీవిత బీమా రెండు లక్షల రూపాయల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం హేమ, ఆర్ఎం సూర్య ప్రతాప్, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, నాబార్డ్ డీడీఎం కార్తీక్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఫైబర్ సీఐ వంశీ, తిమ్మరాజు పల్లి, చాపిరేవుల సర్పంచ్‌లు శేషారెడ్డి, డీఎస్ రాజు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

విశ్వకవి ఠాగూర్‌కు నివాళి



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 84వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత గ్రంథాలయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ.. జాతీయ గీతం రూపకల్పనలో తాను అందించిన సాహిత్యం అమోఘమైనదని కొనియాడారు. గ్రంథాలయ అసిస్టెంట్ శ్రీధర్ మాట్లాడుతూ.. గీతాంజలి కావ్యానికి ఆసియా ఖండంలో సాహిత్యం నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో నటరాజ్ గుప్త, శ్రీనివాసులు, ప్రదీప్, ఆదినారాయణ, రవి, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ కావలెను



రుద్రవరం మండల పరిషత్ కార్యాలయం

రుద్రవరం: రుద్రవరం మండలానికి ఈఓపీఆర్డీ లేక ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో సంతకాలు చేయించుకునేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చి తీరా ఈఓపీఆర్డీ లేరని తెలుసుకుని తిరిగి వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే ఈ పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు ముందు ఈఓపీఆర్డీగా శ్రీనివాసశర్మ విధులు నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనను శిరివెళ్ల మండలానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొత్తగా ఎవరిని నియమించలేదు. కొంత కాలానికి రుద్రవరం మేజర్ పంచాయతీ ఈఓ సుబ్బరావుకు ఈఓపీఆర్డీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన పనితీరు సరిగా లేకపోవడంతో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మండలంలోని సర్పంచులతో నంద్యాలకు వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే మేజర్ పంచాయతీకి సంబంధించి దాదాపు రూ.2.14 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని కొందరు గ్రామస్తులు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సుబ్బారావును నెల క్రితం సస్పెండ్ వేటు పడింది. ఆ తర్వాత ఆయన స్థానంలో సాధారణ బదిలీల్లో రామాంజనేయులును ఈఓపీఆర్డీగా నియమించినా వెంటనే డిప్యూటేషన్‌పై బనగానపల్లెకు వెళ్లారు. అప్పటి నుంచి మండలానికి ఈఓపీఆర్డీ లేరు. ఏదైన కేసుల్లో జామీను పత్రాల్లో సంతకాలు ఈఓపీఆర్డినే చేయాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రుద్రవరం మండలానికి ఈఓపీఆర్డీని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆళ్లగడ్డలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

జయహో.. దేవరాయ

- ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషేక మహోత్సవ వేడుక



ఉయ్యాలవాడలో శ్రీ కృష్ణ దేవరాయుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆళ్లగడ్డ: విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ వేడుకను ఆళ్లగడ్డలో ఘనంగా నిర్వహించారు. గురువారం రాయలు సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ వేడను పురస్కరించుకుని నియోజకవర్గ బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. రాయలు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశభాషలందు తెలుగు లెస్స అని పలికిన శ్రీకృష్ణదేవరాయలు విజయనగ సింహాసనం అధిరోహించి 512 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఆ మహనీయుడిని తలుచుకుంటూ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. 1510 ఆగస్టు 7న శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషేక మహోత్సవం జరిగిందని చరిత్ర కారులు తెలిపారన్నారు. రాయలు కీర్తిప్రతిష్టలను చాటి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు.

- దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం తాలూకా నాయకులు సిద్దిసత్యం మండల నాయకులు సిద్ది నారాయణ, జిల్లా సుబ్బరాయుడు, రామారావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పగడాల రమేష్, శ్రీను, సంజీవరాయుడు పాల్గొన్నారు.

రాయల పాలన ఆదర్శం

ఉయ్యాలవాడ: శ్రీకృష్ణ దేవరాయుల పాలన ఎప్పటకీ ఆదర్శమని బలిజ సంఘం మండల శాఖ అధ్యక్షులు ఆకుల వెంకటసుబ్బయ్య, ఆళ్లగడ్డ తాలూకా గౌరవాధ్యక్షులు అర్జిగారి నరసింహులు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ గౌరవాధ్యక్షులు జింకా వెంకటస్వామి, మండల గౌరవాధ్యక్షులు కమతం చిన్న రాముడు, సాగునీటి సంఘం చైర్మన్ ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, అధిక సంఖ్యలో బలిజ కులస్థులు పాల్గొన్నారు.



బురదమయంగా మారిన మెటల్‌రోడ్డు

ఎమ్మెల్యే గారూ.. మన ఊరి దారే!

దొర్నిపాడు: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు.. ఈ సారైనా మన ఊరి దారిని బాగు చేయండి. డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల మధ్యలో ఉన్న మెటల్ రోడ్డును తారురోడ్డుగా మార్చాలని ఎన్నో ఏళ్ల నుంచి రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దివంగత భూమా నాగిరెడ్డి, భూమా శోభనాగిరెడ్డిలు ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులు గెలుపొందినా సొంతూరు దారిగూర్చి పట్టించుకోలేదు. ఈ దారి ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఈ దారి బాగుచేస్తే కోవెలకుంట్ల ప్రాంత వాసులు డబ్ల్యూ కొత్తపల్లెకు రావడానికి, డబ్ల్యూ కొత్తపల్లె నుంచి ఆళ్లగడ్డకు వెళ్లడానికి రాకపోకలకు సులువుగా ఉంటుందని కోరుతున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరు: పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం ఆత్మకూరు, నంద్యాల క్లస్టర్‌ల ఏసీ, ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పొదుపు మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు వెలుగు సిబ్బంది కృషి చేయాలన్నారు. పొదుపుపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఎలా చెల్లించాలన్న దానిపై వివరించారు. అనంతరం క్లస్టర్‌లలోని సిబ్బందికి పొదుపుపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా డీపీఎంయూ హనుమంతనాయక్, ఆత్మకూరు ఏపీఎం కాశేశ్వరుడు తదితరలు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

డోన్: మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, వారి అడుగుజాడల్లో నడవాలని సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ యువతకు సూచించారు. యువజ న సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గుత్తిరోడ్డులోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య వేడుకలను, అందుకు కారకులైన మహనీయులను స్మరించుకునేందుకు ప్రతి భారతీయుని ఇంటిపై మూడు రంగుల జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ, సెట్కూర్ సూపరింటెండెంట్ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

బేతంచెర్ల: స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, మండల కార్యదర్శి మధుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం డోన్ రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.